7న విజయవాడలో ఫ్యాప్టో ధర్నా

విజయవంతం చేయాలని వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

పోస్టర్లు విడుదల చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
రాష్ట్రంలోని ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా అక్టోబర్ 7వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో వేలాది మంది ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు పి.నరోత్తమరెడ్డి జిల్లాలోని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎన్‌జీవో హోంలో సన్నాహక సమావేశం ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎన్.మణిగండన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నరోత్తమరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు విజయవాడలో చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుండి తప్పించడం, అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పిఆర్సి, మధ్యంతర భృతి మంజూరు, సిపిఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని తెలిపారు. ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెబుతూనే రాష్ట్రంలోని 12లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించిన పరిస్థితి ఉందనీ కానీ ఏ సమస్యపైనా చర్చించే లేదన్నారు. ప్రభుత్వ పథకాలను, నిర్ణయాలను విజయవంతంగా అమలు చేస్తున్న ఉద్యోగులకు సంబంధించిన సమస్యల పరిష్కారం, సంక్షేమం మాత్రం ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించవలసిన దాదాపు 30వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరినప్పటికీ ఇంతవరకు స్పందన లేదన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఇంతవరకు చర్చించిన పరిస్థితి లేదన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు ప్రతి సంవత్సరం 180 కోట్ల రూపాయలు హెల్త్ కార్డుల అమలు కొరకు చెల్లిస్తున్నప్పటికీ హెల్త్ కార్డుపై వైద్యానికి ఏ హాస్పిటల్లో అంగీకరించడం లేదన్నారు. ప్లస్ టు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు. వెంటనే ప్లస్ టూ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పురపాలక ఉపాధ్యాయులకు జిపిఎఫ్ సౌకర్యం, అర్బన్ ఎంఈఓ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. గురుకుల, ఆదర్శ, 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులతో వెట్టి చాకిరీ చేయించుకుంటూ కనీస వేతన స్కేల్ కూడా అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వెంటనే ఎంటీఎస్‌ను అమలు చేయాలని కోరారు. ఫ్యాప్టో చైర్మన్ మణిగండన్ మాట్లాడుతూ కారుణ్య నియామకాలలో జాప్యం వలన మరణించిన ఉద్యోగుల వారసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అంతర్ జిల్లా బదిలీలలో స్పౌజ్ క్యాటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న వారందరికీ బదిలీ అవకాశం కల్పించాలని కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్, జేఎల్ పదోన్నతుల సమస్యపై ప్రభుత్వం చిత్తశుద్ధి కనపరచకపోవడంతో మూడు దశాబ్దాలుగా కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో విద్యారంగ, ఆర్థిక సమస్యలపై చర్చించి పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ.రమణ, సెక్రటరీ జనరల్ మునీర్ అహమ్మద్, కో చైర్మన్ రామమూర్తి, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ ఎన్ఆర్.మదన్ మోహన్ రెడ్డి, జగదీశ్, చిట్టిబాబు, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, రెడ్డెప్ప నాయుడు, పార్థసారథి, ముక్తార్ అహమ్మద్, చంద్రన్, గణపతి పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై శ్రీ మలయప్ప

సూర్యప్రభ వాహనంపై విహరిస్తున్న శ్రీమలయప్ప

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో 7వ రోజు మంగళవారం ఉదయం 8 గంటలకు స్వామివారు బద్రి నారాయణుడి అలంకారంలో సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వాహనం ముందు భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహనంపై శ్రీమలయప్పస్వామి దర్శనమిచ్చారు. ఈ వాహన సేవలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, జేఈవో వి.వీరబ్రహ్మం, సివిఎస్వో కెవి.మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

1న రథోత్సవం: బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన బుధవారం ఉదయం 7 గంటలకు స్వామివారి రథోత్సవం వైభవంగా జరుగనుంది.

శోభాయమానంగా స్నపన తిరుమంజనం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో పవిత్రాలు, డ్రైఫ్రూట్లు, రోజా మాలల అలంకారంతో స్నపన తిరుమంజనం శోభాయమానంగా జరిగింది. ఆలయంలోని రంగనాయకుల మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రకాల ఫలాలు, పుష్పాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అందంగా అలంకరించారు. నీలి పవిత్రాలు, లవంగాలు, వట్టివేరు, తులసి, డ్రైఫ్రూట్లు, రోజామాలలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించారు. వివిధ రంగుల పుష్పాలు, ఫలాలు, సాంబ్రాణి, ధూపదీప నైవేద్యాల నడుమ రంగనాయకుల మండపం నూతనత్వాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు కొబ్బరినీళ్ల తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. వేదపండితులు చతుర్వేదపారాయణం ఆలపించారు. బ్రహ్మోత్సవాల సమయంలో వాహనసేవల్లో తిరువీధుల్లో ఊరేగి అలసిపోయే స్వామివారు స్నపన తిరుమంజనంతో సేద తీరుతారని ఆలయ అర్చకులు తెలిపారు. పెద్దజీయంగార్ పర్యవేక్షణలో కంకణభట్టర్ వేణుగోపాలదీక్షితులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చిన్న జీయంగార్, టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, ఇతర అధికారులు పాల్గొన్నారు.


చంద్రప్రభ వాహనంపై..

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ

వైసిపి నిరసన

అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆధ్వర్యంలో మంగళవారం వైసిపి నాయకులు నిరసన తెలిపారు. మెడికల్ కళాశాలను ప్రయివేటు వ్యక్తుల పరం చేసేలా కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను రద్దు చేయాలని కోరుతూ వైఎస్ఆర్ దళిత విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా అంబేదర్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిచారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మాజీ ఎంఎల్ఏలు సునీల్, లలితా థామస్స్ చిత్తూరు నియోజవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి, గాయత్రిదేవి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్ పేద విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ప్రభుత్వమే మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయాలని భావిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చేలా జీవో తీసుకురావడం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికపై సామూహిక అత్యాచారం

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
- పోక్సో కింద కేసు నమోదు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిత్తూరు డీఎస్పీ సాయినాథ్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్
బాలికపై ముగ్గురు వ్యక్తులు అత్యాచారం చేసిన సంఘటన చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈనెల 25వ తేదీ చిత్తూరు నగర శివారు ప్రాంతం పెనుమూరు క్రాస్ చిత్తూరు -తిరుపతి రోడ్డులోని నగర వనం పార్కులోకి ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో స్థానిక బాలిక ఆమె స్నేహితుడు కాసేపు సరదాగా గడిపేందుకు వెళ్ళారు. పార్కులో సరదాగా మాట్లాడుకుంటున్న వీరిని చిత్తూరు నగరానికి చెందిన కిషోర్, హేమంత్ ప్రసాద్, మహేష్ సెల్‌ఫోన్‌లో ఫోటోలు, వీడియోలు తీసి సోషియల్ మీడియాలో పెడతామంటూ బెదిరించి బాలిక ఒంటిపై ఉన్న బంగారు చైన్ లాక్కోవడంతో పాటు బాలిక స్నేహితుడ్ని బెదిరించి తాళ్ళతో కట్టేసి బాలికపై కిషోర్, హేమంత్, మహేష్ సామూహిక అత్యాచారం చేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు బాలికను అత్యాచారం చేసిన ముగ్గురుని పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఈముగ్గురిలో ఒకరు పారిపోగా మిగిలిని ఇద్దరిని స్థానికులు తాలూకా పోలీసులకు అప్పగించారు. అయితే పోలీసులు మాత్రం బాలిక అత్యాచారం ఘటనపై 29వ తేదీ మైనర్ పాటు పార్కుకి వెళ్ళిన స్నేహితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన్నట్లు చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ మంగళవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి తెలిపారు. బాలిక అత్యాచారం ఘటనపై పోక్స్ చట్టంతో పాటు, బాధిత బాలిక ఎస్సీ కావడంతో ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద బాలిక అత్యాచారం కేసులో హేమంత్ ప్రసాద్, మహేష్, కిషోర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తన్నట్లు తెలిపారు. అయితే ఇప్పటి వరకు వీరిలో ఒక్కర్ని కూడా అదుపులోకి తీసుకోలేదన్నారు.

అభివృద్ధి ఓర్వలేకనే విమర్శలు: ఎమ్మెల్యే


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ గురజాల

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే సోషియల్ మీడియాలో తనపై విమర్శలు చేస్తున్నారని ఎంఎల్ఏ గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం స్థానిక ఎంఎల్ఏ కార్యాలయలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలిక ఆత్యాచారం ఘటనలో తెలుగుదేశం కార్యకర్తలున్నారంటూ వైసిపి సోషియల్ మీడియాలో చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. చాలా మంది తనతో ఫోటోలు తీసుకుంటారని ఆ ఫోటోలు తీసుకొనేవారికి పార్టీతో సంబంధం లేదన్నారు. తాను చేస్తున్న అభివృద్ధిని చూసి టిడిపిలో చేరిన్నట్లు తెలిపారు. తమ పార్టీ అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించదన్నారు. బాలిక అత్యాచార ఘటనలో నిందితులుగా ఉన్న ముగ్గురు వ్యక్తులు వైసిపిలో ఉన్నట్లు తెలిపారు. వైసిపి చిత్తూరు నియోజవర్గం ఇన్‌చార్జి విజయానందరెడ్డితో ఉన్న ఫోటోలను చూపారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు లోకేష్, నవీన్, పచ్చప్పన్ పాల్గొన్నారు.

వాళ్ళు టిడిపి కార్యకర్తలే... విజయానందరెడ్డి

బాలిక అత్యాచారం ఘటనలో నిందితులు ముగ్గురు టిడిపి కార్యకర్తలేనని వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజయానందరెడ్డి, నాయకులు జ్ఞానజగదీష్, గాయత్రిదేవిలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. చిత్తూరు నగర పరిధిలో మురకంబట్టు వద్ద చోటు చేసుకున్న బాలిక అత్యాచారం ఘటనలో ముగ్గురు నిందితుల్లో ఒకరు టిడిపికి చెందిన వారు కావడంతో పోలీసులు, టిడిపి నాయకులు కాపాడే ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు. వైపిపి సోషియల్ వీడియా ప్రయత్నం వల్ల పోలీసులు విధిలేని పరిస్థితుల్లో ఆఘమేఘాలపై ప్రెస్‌మీట్ పెట్టాల్సి వచ్చిందన్నారు. బాలిక అత్యారం ఘటనలో నిందితులకు తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని వారి వికృతచేష్టలను సహించలేక పార్టీ నుండీ తొలగించిన్నట్లు తెలిపారు. నిందితులకు కఠినంగా శిక్షించాలన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

వరసిద్ధుని సేవలో చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్

చీఫ్ సెక్రటరీకి స్వామివారి తీర్థప్రసాదాలు అందిస్తున్న కలెక్టర్, ఏఈవో

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. వీరితో పాటు చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కూడా స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఏఈవో రవీంద్రబాబు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. అలాగే సీనియర్ ఐఏఎస్ అధికారి వాణిమోహన్ కూడా స్వామివారి కుటుంబ సమేతంగా దర్శించుకన్నారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు, టెంపుల్స్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు ఉన్నారు.

విద్యార్థులు సమాజ హితానికి పాటుపడాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఎస్ఎఫ్ఐ 25వ మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం వేమన విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని రిజిస్ట్రార్ భూపతి నాయు డు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మంచి కోసం విద్యార్థి సంఘాలు పని చేయాలన్నారు. తాను విద్యార్థిగా ఉన్నపుడు విద్యార్థి నాయకుడిగా గెలిచానని గుర్తు చేసుకున్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు యూని వర్సిటీ విద్యార్థుల సమస్యలపై పోరాడు తున్నారని, రాత్రి 10 గంటల వరకు అయినా సరే కూర్చొని చర్చించి విద్యార్థి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాంమోహన్, ప్రసన్న కుమార్‌లు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలకు తిరుపతిలో అతిధ్యం ఇవ్వడమంటే విద్యార్థుల హక్కులు, ఉద్యమాలకు సహకరించడమేనన్నారు. టెంకాయలు దామోదరం మాట్లాడుతూ ర్యాగింగ్ సంస్కృతికి వ్యతిరేకం గా చైతన్యం కల్గించాలన్నారు. అపుస్మా ప్రైవేట్ విద్యా సంస్థల సీనియర్ నాయకులు విశ్వ నాథ్ రెడ్డి మాట్లాతూ అందరికీ విద్య కోసం పోరాడే విద్యార్థి సంఘాలు అవసరమన్నారు. మాజీ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భగవాన్ నాగరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం కోసం పోరాడిన చరిత్ర, మంచి నాయకులని అందించిన ఘనత ఎస్ఎఫ్ఐకి ఉందని, అలాంటి సంఘం మహాసభలు తిరుపతిలో జరగడం శుభపరిణామమన్నరు. అనంతరం మహాసభ ఆహ్వాన సంఘం కమిటీ ఏర్పాటు చేశారు. మహాసభ ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులుగా టెంకాయల దామోదరం, అధ్యక్షులుగా ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా భగత్ రవి, కోశాధికారిగా అక్బర్, గౌరవ సలహాదారులుగా విశ్వనాథ్ రెడ్డి, తిప్పరెడ్డి చీఫ్ ప్యాట్రిన్స్‌గా అప్ప రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజులను ఎంపిక చేశారు.

తిరుపతి ⟷ రాజమండ్రి @1499

- ఆ విమానంలో ఛార్జి రూ.1499
- నేడు తిరుపతికి కొత్త విమాన సర్వీస్
- రాజమండ్రి - తిరుపతి మధ్య రాకపోకలు
- అలయన్స్ ఎయిర్ లైన్స్ దసరా కానుక

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో : తిరుమల శ్రీవారి భక్తులకు మరో విమాన సర్వీస్ అందుబాటులో రానుంది. అలయన్స్ ఎయిర్ లైన్ సంస్థ దసరా పండుగ పురస్కరించుకుని రాజమండ్రి – తిరుపతి మధ్య నడిచే ఈ సర్వీస్‌ను కేంద్ర విమానయాన శాఖ మంత్రి కే.రాంమోహన్ నాయిడు బుధవారం రాజమండ్రిలో ప్రారంభించనున్నారు. ప్రయాణికులు ఆకర్షించేందుకు అలయన్స్ ఎయిర్ లైన్ సంస్థ రాజమండ్రి తిరుపతి మధ్య టికెట్ ధర1499 రూపాయలుగా నిర్ణయించింది.

తిరుమల శ్రీవారి భక్తుల సౌకర్యం కోసం మరో విమాన సర్వీసును అందుబాటులోకి తీసుకువస్తూ శుభవార్త చెప్పింది. అక్టోబర్ ఒకటవ తేదీ నుండి రాజమహేంద్రవరం తిరుపతి మధ్య ఈ కొత్త విమాన సర్వీస్ ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా అలయన్స్ ఎయిర్ లైన్స్ ప్రయాణికులకు అద్భుతమైన ఆఫర్‌ను ప్రకటించింది. అక్టోబర్ 2,4,6 తేదీల్లో తిరుపతి నుండి రాజమహేంద్రవరం విమాన టికెట్ ధర కేవలం 1499 రూపాయలుగా నిర్ణయించారు. అంతకుముందు ఈ టికెట్ ధర 1999 రూపాయలుగా ఉండగా, తిరుమలకు వెళ్లే భక్తులను ఆకర్షించాలనే లక్ష్యంతో ఈ టికెట్ ధరలు తగ్గించినట్లు అలయన్స్ విమాన సంస్థ రాజమహేంద్రవరం మేనేజర్ వెల్లడించారు. 1499 రూపాయలకే విమానంలో ప్రయాణం చేసి తిరుమల శ్రీవారిని దర్శించుకోవచ్చని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తిరుపతికి కొత్త సర్వీస్‌పైన శుభవార్త చెప్పిన కేంద్రమంత్రి

తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి భక్తులకు ఇది చాలా సౌకర్యవంతమైన, సుఖవంతమైన ప్రయాణాన్ని అందిస్తుందని, తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో శ్రీవారిని దర్శించుకోవచ్చని అలయన్స్ ఎయిర్ లైన్స్ చెబుతోంది. ఇక అక్టోబర్ ఒకటవ తేదీ నుంచి రాజమహేంద్రవరం తిరుపతి మధ్య అలయన్స్ ఎయిర్ లైన్స్ విమానాలు వారంలో మూడు రోజులు నడుస్తాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఈ కొత్త సర్వీస్ పైన శుభవార్త చెప్పారు.

వారంలో మూడు రోజులు..

మొదటి రోజు అక్టోబర్ ఒకటవ తేదీ ఉదయం 9 గంటల 25 నిమిషాలకు తిరుపతి నుంచి బయలుదేరి విమానం రాజమహేంద్రవరంకు చేరుకుంటుందని, మళ్లీ తిరుగు ప్రయాణం 10 గంటల 15 నిమిషాలకు ప్రారంభమవుతుందని మంత్రి తెలిపారు. అక్టోబర్ రెండవ తేదీ నుంచి ఈ సర్వీసులు ప్రతి మంగళవారం, గురువారం, శనివారం అందుబాటులో ఉంటాయన్నారు.

విమాన సర్వీసుల సమయాలు..

మంగళవారం, గురువారం, శనివారం రోజుల్లో ఉదయం 7 గంటల 40 నిమిషాలకు తిరుపతి నుంచి బయలుదేరి విమానం ఉదయం 9 గంటల 25 నిమిషాలకు రాజమహేంద్రవరం చేరుకుంటుందని అలయన్స్ విమాన సంస్థ మేనేజర్ పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలో రాజమహేంద్రవరం నుంచి ఉదయం 9 గంటల 50 నిమిషాలకు బయలుదేరి, ఉదయం 11 గంటల 20 నిమిషాలకు తిరుపతి చేరుకుంటుందని తెలిపారు.

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి

- సూపర్ సిక్స్ పథకాలు అందరికీ అందచేయాలి
- ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మస్తాన్ బి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా మహాసభ తిరుపతిలోని యుటిఎఫ్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సభలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు మస్తాన్ బి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, హింస పెరిగిపోతున్నాయని, వీటిని కట్టడి చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలని, సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు నెలకు 1500 రూపాయలు పథకం ఊసే లేదన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు నామమాత్రంగా కొద్దిమందికి మాత్రమే వస్తున్నాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కొన్ని బస్సులకు మాత్రమే పరిమితమయిందన్నారు. ఎన్నికల హామీలు ఆంక్షలు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు 12 గంటల పని విధానాన్ని ఆమోదిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమని, మహిళలలు అనారోగ్యం పాలవుతారని ఈ తీర్మానాన్ని విరమించుకోవాలన్నారు. మైక్రో ఫైనాన్స్‌ల వేధింపులకు అనేకమంది మహిళలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొదుపు సంఘాల్లోని మహిళలకి ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా ఎం.జయంతి, ఈశ్వరి, రాధమ్మ వ్యవహరించగా, జిల్లా కార్యదర్శి పి సాయి లక్ష్మి, నాయకులు సత్య శ్రీ, సుజాతమ్మ , చంద్రకళ, నాగమణి, లక్ష్మి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

స్వచ్ఛ కుప్పం మనందరి బాధ్యత: ఎమ్మెల్సీ

స్వచ్ఛకుప్పం ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ, కడ పీడీ, టిడిపి నాయకులు

ప్రజాశక్తి- కుప్పం: స్వచ్ఛ కుప్పం స్వర్ణకుప్పం ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడ పీడీ వికాస్ మరమ్మత్ ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు. కుప్పం పట్టణంలో మంగళవారం స్వచ్ఛోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించి చెత్త వేయకు పాపం చేయకు అంటూ నినాదాలు చేశారు. రంగులతో వేసిన మహాత్మా గాంధీ చిత్రపటం వద్ద క్యాండిల్ ఉంచి స్వచ్ఛ కుప్పంకు సంపూర్ణంగా సహకరిస్తామంటూ నినాదాలు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భావించాలని కుప్పం మున్సిపాలిటీని రాష్ట్రానికే స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్సీ శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రెస్కో చైర్మన్ ప్రతాప్, అడ్వైజర్ కమిటీ సభ్యులు రాజ్ కుమార్, సుగుణమ్మ, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్లు జిమ్ దాము, జాకీర్, సోమశేఖర్, సురేష్, రాష్ట్రనేత గోపీనాథ్ పాల్గొన్నారు.

బయోట్రీమ్‌లోఎంట్రప్రెన్యూర్స్ వర్క్‌షాప్

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): తిరుపతి–కరకంబాడి మార్గంలోని అటవీ శాఖకు చెందిన బయోట్రిమ్‌లో ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో క్లౌడ్ టీం ఆర్గనైజేషన్ సహకారంతో ఎంట్రప్రెన్యూర్స్ కోసం ఇంటలెక్చువల్ ప్రాపర్టీ అండ్ రైట్స్‌పై వర్క్ షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఆర్డిఏ విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు, కడప ఏపీఎఫ్పిఎస్ఈడి సతీష్, డిఐసి ఐపిఓ హరికృష్ణ, కెవిఐబి ఏడి వెంకటరావు, సెట్ విన్ సిఈఓ మురళికృష్ణ, డిఆర్పి ప్రసాద్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, కెఎల్ యూ డైరెక్టర్ ఆఫ్ ఇన్నోవేషన్ కెఆర్ రావు, విట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జానకిరామయ్య, క్లౌడ్ టీం ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఆర్ఎస్ రామిరెడ్డి పాల్గొన్నారు. తిరుపతి, చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాల నుండి అనేక మంది ఎంట్రప్రెన్యూర్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వర్క్ షాప్ లో పాల్గొన్న ఔత్సాహితులకు ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందించారు.

నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

మాజీ సర్పంచ్‌కు నివాళులు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని జక్కదొనలో టిడిపి సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ జగన్నాథం యాదవ్ మంగళవారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయానికి పలువురు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. వెదురు కుప్పం టిడిపి మాజీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్ మురళి, సొసైటీ ఛైర్మన్ సుధాకర్ రెడ్డిలు టిడిపికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ప్రధాన కార్యదర్శి నరసింహ యాదవ్, మాజీ సర్పంచ్ బాబు రెడ్డి, సోక్రటీస్, స్కూలు రెస్పాండెంట్ గుణశేఖర్, పార్లమెంటు వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు బోడీరెడ్డి వెంకటరమణారెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు దామోదర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ మనోహర్ నాయుడు , ఆళ్లమడుగు సర్పంచ్ నవనీతమ్మ, దామోదర్‌రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ వరప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న వైసిపి నాయకులు

ఎంపీకి బెయిల్‌పై సంబరాలు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరు కావడంతో వెదురుకుప్పం మండలంలోని ఆ పార్టీ మండల అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వైసిపి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. 'న్యాయం గెలిచింది.. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి నాయకత్వం. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి నాయకత్వం వర్ధిల్లాలి..' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

శాంతిపురం: రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డికి ఏసీబీ కోర్టులో ఊరట దక్కింది. ఇప్పుడు బెయిల్ మంజూరు కావడంతో వైసీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. వారిలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు కే కోదండరెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి చక్రపాణి రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, సోమరాంరెడ్డి, ఆనందరెడ్డి, మురళీమోహన్ రెడ్డి, గజ్జల రమేష్, చలపతి, మంజునాథ్ రెడ్డి,నగేష్, శ్రీరాములు, మంజు, అమర, రామచంద్ర, భాస్కర్ రెడ్డి,, జ్ఞానేంద్ర, శాంతిపురం మండల వైసిపి నాయకులు ఉన్నారు.

రొంపిచెర్ల : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి కి ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై రొంపిచెర్లలో అంబేద్కర్ విగ్రహానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేసి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, మండల వైసిపి కన్వీనర్ కరీముల్లా, వైసిపి నాయకులు చెంచురెడ్డి, సిద్ధరామి రెడ్డి, మంజూర్, మహబూబ్ బాషా,అల్లాబక్షు, కోటా వెంకటరమణ, బావాజీ సాహెబ్, రాజా సాహెబ్, గురు, ఓబులేష్, శంకర్ రెడ్డి, శ్రీనాథ నాయుడు, రమణా రెడ్డి, పూజిత రెడ్డి, కుమార్ రెడ్డి, కేశవరెడ్డి, రవీంద్ర నాథ్ రెడ్డి, అమరనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు:

గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో వెలసిన శ్రీ అల్లియల్లమ్మ తల్లి దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా 600 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ దారులుగా గంగాధర నెల్లూరుకు చెందిన కలవకుంట సుబ్రహ్మణ్యం కస్తూరి దంపతులు వ్యవహరించగా, కలవకుంట మురళి బాబు, విజయబాబు కుటుంబ సభ్యులు దాదాపు 600 మందికి అన్నదానం నిర్వహించారు.

కార్వేటినగరం : కార్వేటినగరం శ్రీధర్మ రాజుల స్వామి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం దుర్గాదేవి అలంకరణలో ఏర్పాటు చేశారు. ఉదయం ఆలయంలో అభిషేకాలు ఇ. ఉపేంద్ర నాథ్ రెడ్డి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం పుష్పవేణి దామోదర్ లైన్ ఇన్‌స్పెక్టర్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దుర్గాదేవి అలంకరణతో పురవీధులలో అమ్మవారిని ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు కరపు హారతులు పట్టారు. మధ్యాహ్నం 500 మందికి అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రవి యాదవ్, ఉపాధ్యక్షులు రవి రెడ్డి, కార్యదర్శి గౌతమ్ రాజు , కోశాధికారి లక్ష్మీపతి, ఉపకోశాధికారి సాయి రాయల్, భక్తులు పాల్గొన్నారు.

దుర్గా దేవి అలంకరణలో శ్రీ బంగారమ్మ

ప్రజాశక్తి -కార్వేటినగరం: కార్వేటి నగరంలోని శ్రీ బంగారమ్మ ఆలయంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారిని దుర్గా దేవి అవతారంలో భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కే ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

మసీదు భూములు కాపాడండి

- పోలీసులకు ముతవల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి -పుంగనూరు: పట్టణంలోని రాతి మసీదుకు చెందిన 495 ఎకరాల మసీదు భూములను కొందరు ఆక్రమించుకున్నారని వారి నుండి భూమిని కాపాడి తమకు అప్పగించాలని అర్బన్ సర్కిల్ కార్యాలయంలో ముతవల్లీలు, జామియా మసీద్ కమిటీ సభ్యులు మంగళవారం ఫిర్యాదు చేశారు. పట్టణంలోని రాతి మసీదు కు చెందిన 495 ఎకరాల భూమి ఉంది. చౌడేపల్లి మండలం కాటి పెరి పంచాయతీ గురు మర్దనపల్లి మసీదుకు చెందిన భూమిని చాలా రోజుల నుండి రైతులు కౌలుకుచేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆ భూమి కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి అమ్మడానికి ప్రయత్నిస్తున్నట్టు తమకు తెలిసిందన్నారు. ఈ విషయాన్ని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. తమ కమిటీ ఆధ్వర్యంలో విచారించగా వడ్డూరుపల్లికి చెందిన గంగిరెడ్డి, దిగ ఊరుకు చెందిన వెంకటరెడ్డి, మరికొందరు కలసి అమ్మడానికి ప్రయత్ని స్తున్నట్లు తెలిసిందన్నారు. వారిని విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ భూములు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాబా ఫక్రుద్దీన్, మసీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేసిన ముస్లిం మత పెద్దలు

అవగాహనతోనే అభివృద్ధి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి:

అవగాహనతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మండల వ్యవసాయాధికారి గీతాకుమారి పేర్కొన్నారు. మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ ప్రోగ్రాం' రెండవ వారంలో భాగంగా, అక్టోబర్ 1వ తేదీ, 3వ తేదీలలో మండల స్థాయి రైతుసేవా కేంద్రం స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ నేడు ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ అనుబంధ రంగాలపై అవగాహన సమావేశం , ప్రదర్శన రైతులు, యువత, స్త్రీ శక్తి అందరికీ అవసరమైన సమాచారం ఒకే వేదికపై, మండల కేంద్రంలో ట్రాక్టర్ల ర్యాలీ , వ్యవసాయ యాంత్రీకరణకు ప్రచారం, కొత్త టెక్నాలజీ ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. రైతులకి ప్రత్యక్షంగా సమాచార బోధన, సరళంగా, స్పష్టంగా, ఉపయోగకరంగా వుండేలా నిర్వహించే ఈ కార్యక్రమానికి రైతులు, మహిళా సంఘాలు, యువకు లు, అధికారులు అందరూ హాజరై ఈ కార్యక్రమా లను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

డిజిటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - వెదురుకుప్పం: వెదురుకుప్పం మండల కేంద్రంలో మంగళవారం వైసిపి మండల అధ్యక్షుడు కామసాని పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సృష్టించిన డిజిటల్ బుక్ పోస్టర్‌ను వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు.

జిడి నెల్లూరులో నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి నాయకులు

గంగాధర నెల్లూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి వైసిపి కార్యకర్తలు, నాయకులపై చేస్తున్న దౌర్జన్యాలు, అక్రమాల కుట్రలపై వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి గంగాధర నెల్లూరు మండల కేంద్రంలో ఆవిష్కరించారు. దీన్ని వైసిపి నాయకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు మునిరాజారెడ్డి, మాజీ గ్రీన్ అండ్ బ్యూటిషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, మాజీ మార్కెటింగ్ డైరెక్టర్ వేలు మొదలియార్, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ వెంకటరత్నం, వైసీపీ సీనియర్ నాయకుడు బలరామిరెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయాల్లోనే పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంయుక్త చర్యా సంఘం ఆధ్వర్యంలో జరుగు తున్న ఉద్యమ కార్యక్రమంలో భాగంగా బుధవారం పంపిణీ చేయబోయే సామాజిక పెన్షన్లు సచివాలయాల పని వేళల్లోనే అందించాలనే నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 10 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఆయా సచివాలయాల వద్ద లబ్ధిదారులు తమ పెన్షన్లు పొందవచ్చని తెలిపారు. అయితే వికలాంగులు, మంచంలో ఉన్న లబ్ధిదారుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వారికోసం సిబ్బంది నేరుగా వారి ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందజేయనున్నారు. ఈ విషయాన్ని ప్రతి సచివాలయ కార్యదర్శి తమ పరిధిలోని గౌరవ కౌన్సిలర్లకు, స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. అక్టోబర్ 1వ తేదీ సాయంత్రం లోపలే 100 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తిచేయాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంయుక్త చర్యా సంఘం స్పష్టంగా ఆదేశించింది.

అంజేరమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : దుర్గాష్టమి శుభ సందర్భంగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వడమాల పేట సమీపంలో కొలువై ఉన్న అంజేరమ్మ తల్లిని మంగళవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దుర్గాష్టమి రోజున అమ్మవారిని దర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు. సత్యవేడు నియోజకవర్గ ప్రజలందరూ అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని దుర్గమ్మ తల్లిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే ఆదిమూలం వెల్లడించారు.

ఏపీ బెస్త సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా తిరుమగళ్

ప్రజాశక్తి-కుప్పం: ఆంధ్రప్రదేశ్ బెస్త సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా కుప్పం టిడిపి నాయకురాలు తిరుమగళ్ నియమితు లయ్యారు. ప్రభుత్వం పలు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి కౌన్సిలర్ అభ్యర్థిగా తిరుమగళ్ దాఖలు చేసిన నామినేషన్ ఆమెకు తెలియకుండానే విత్ డ్రా కావడంతో అప్పట్లో ప్రతిపక్ష నేత చంద్రబాబు సమక్షంలో మీడియా సమావేశం నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయంగా మారింది. తిరుమగల్ ను బెస్త సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడంపై టిడిపి నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టిడిపి నాయకురాలు తిరుమగళ్

మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్‌గా అమరావతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మత్స్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గా బంగారుపాలెం మండలం తగువారి పల్లి పంచాయతీకి చెందిన అమరావతిని ఎంపిక చేశారని ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో తగ్గువారిపల్లి పంచాయతీ సర్పంచిగా విధులు చేపట్టి టిడిపి అధికారంలోకి వచ్చేందుకు అహర్నిశలు కృషి చేశారని టిడిపి గుర్తించి మత్స్యకార శాఖ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక చేశారన్నారు. ఎంపిక సహకరించిన మండల అధ్యక్షులు ధరణి ప్రసాద్, పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌కు పదవి రావడానికి సహకరించిన పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

ఏపీ మత్స్య కార కార్పొరేషన్ డైరెక్టర్ అమరావతి

ఉనికి కోసమే విమర్శలు

పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమనాయుడు

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: వైసిపి నేతలు ఉనికి కోసమే కూటమి ప్రభుత్వంపై లేనిపోనీ విమర్శలు చేస్తున్నారని పెనుమూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణమనాయుడు అన్నారు. గంగాధర నెల్లూరులో మంగళవారం సాయంత్రం సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై పలువురు టిడిపి నేతలు గంగాధరనెల్లూరు పురవీధుల్లో ఫ్లెక్సీ చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా కానుక కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రేట్లను తగ్గించడంతో దేశంలో అన్న వర్గాలకు వివిధ వస్తువుల ధరలు తక్కువ రేటుకే లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, సింగిల్ విండో చైర్మన్ మోహన్ నాయుడు, పార్లమెంట్ టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, యువ నాయకుడు హరీష్ యాదవ్, సింగిల్ విండో డైరెక్టర్లు జ్యోతి యాదవ్, చిన్నా, పార్లమెంట్ టిఎన్టియుసి అధికార ప్రతినిధి జీవరత్నం, నియోజకవర్గ టిఎన్‌టియుసి అధికార ప్రతినిధి గోపి, పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా దసరా మహోత్సవాలు

ప్రజాశక్తి-గుడుపల్లి: గుడుపల్లి మండలంలని శ్రీ రాళ్ల గంగమాంబ ఆలయంలో అమ్మ వారికి శాకంబరి అలంకరణ చేశారు. గుడిపల్లి మండలంలోని కన్నయ్య శెట్టి, బాలాజీ చేతుల మీదుగా అమ్మవారికి శాకంబరి అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

వి కోటలో

వి కోట : దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా 8వ రోజు 'దుర్గాష్టమి'ని పురస్కరించుకుని వి కోటలో మంగళవారం 4005 పాలకలశాల శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని దుర్గామాత ఆలయ ప్రాంగణంలో దుర్గ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ దంపతులు, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీపీ యువరాజ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రనాయుడు, మాజీ ఎంపీపీ సులోచన రంగనాథ్ దంపతులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. దుర్గామాత ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి దంపతుల ప్రథమ పూజతో శోభాయాత్ర ప్రారంభించారు. ఎలాంటి అసౌక్యం కలగకుండా సీఐ సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. దుర్గామాత ఆలయ కమిటీ వాలంటీర్లు, కమిటీ సభ్యులు మహిళల భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించడంపై చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తుకారం, జగన్ మోహన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి అనుబంధం దేవాలయం మణికంఠేశ్వర స్వామి వారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా మంగళవారం బాలత్రిపుర సుందరి దేవి అలంకారంలో మరగదాంబికా దేవి దర్శనమిచ్చారు. తరువాత రాత్రి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. కుంకుమార్చనలు , ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు వేద పండితులు పాల్గొన్నారు.

పుంగనూరు: మండలంలోని చదళ్లలో వెలిసిన సప్తమాతృక సమేత శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ వ్యవస్థాపకులు ఎన్ వేణుగోపాల్ రెడ్డి ఉషశ్రీ దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా హోమాలు, పూజలు నిర్వహించారు. మంగళవారం శ్రీ చౌడేశ్వరి దేవిని శ్రీ దుర్గా దేవి అలంకరణలో అత్యంత వైభవంగా ప్రతిష్ఠించారు. వేద పండితులు ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో వేద పారాయణ దుర్గాదేవి సూక్త హోమాలను నిర్వహించారు. ఎన్‌వీఆర్ ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన లక్ష్మీనరసింహ స్వామి నాట్యకళా మండలి ఆధ్వర్యంలో సాసవలి చిన్నమ్మ కథ హాస్య నాటకం ప్రేక్షకులను అబ్బురపరిచింది. కళాకారులను ట్రస్ట్ వ్యవస్థాపకులు వేణుగోపాల్ రెడ్డి శాలువా జ్ఞాపికాలతో సత్కరించారు. సాయంత్రం పూజలు అనంతరం అన్నదానం నిర్వహించారు.

పలమనేరు: పలమనేరు పాతపేట శ్రీ కనకదుర్గ నగర్‌లోని కనకదుర్గాదేవి ఆలయంలో గత ఎనిమిది రోజులుగా దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం ప్రత్యేక పంచామృత అభిషేకాలు, విశేష పుష్పాలంకరణలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా చండీ హోమం నిర్వహించారు.

క్రైం న్యూస్

మేక పిల్లలను చంపిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి:

మేక పిల్లలను చంపిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలం పాతపేట పంచాయతీ కుప్పనపల్లి గ్రామానికి చెందిన బాధితుడు వెంకటరమణప్ప కుమారుడు పాండు మాట్లాడుతూ తనకు ఉన్న మేకల షెడ్డులో 20 మేక పిల్లలను పెంచుతున్నానని తెలిపాడు. ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం పొలం పనులు చేయడానికి కుటుంబ సభ్యులు వెళ్లగా మేకల షెడ్డులో ఉన్న 16 మేక పిల్లలను గొంతు నులిమి బండకేసి కొట్టి తలలు వేరు చేసి చంపారని ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఆ గ్రామంలో ఆరా తీయగా అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తిగా నిర్ధారించారన్నారు. ఆ వ్యక్తి గతంలో కూడా 40 వేల రూపాయల విలువచేసే గొర్రె పొట్టేలును సంహరించి కొన్ని భాగాలు వండుకుని తిన్నాడన్నారు. 20వేల రూపాయల జరిమానా గ్రామ పెద్దలు వేశారని తెలిపాడు. ఈ పని కూడా తనే చేసినట్లు గ్రామంలో కొందరు చూసినా బయట చెప్పడానికి ఇష్టపడటం లేదని తెలిపాడు. ఈ విషయమై గ్రామ పెద్దలు పంచాయతీ నిర్వహించి ఈ దుశ్చర్యకు పాల్పడిన వ్యక్తిని ప్రశ్నించగా అతను పారిపోయాడన్నారు. ఇంత క్రూరంగా చిన్న చిన్న మేక పిల్లలను చంపడం ఉన్మాది చేసే పని అని, ఇతనికి శిక్ష తప్పకుండా పడాలని లేని పక్షంలో ఎవరిపై ఏ సమయంలో పడతాడో అనే భయం ఉందన్నారు. రెండు రోజుల నుండి ఆ వ్యక్తి మచ్చు కత్తి చేత పట్టుకుని గ్రామంలోని వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని అతడిని అదుపులో తీసుకొని బాధితులకి న్యాయం చేయాలని బైరెడ్డిపల్లి పోలీసుకు విన్నవించుకున్నారు.

అప్పు చెల్లించని పెట్రోల్ బంక్ యాజమాన్యం

బాధితుల నిరసన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

ఇబ్బందుల్లో ఉన్నారని ఓ పెట్రోలు బంకు యజమానురాలికి అప్పు ఇస్తే తిరిగి ఇవ్వలేదని ఇది అన్యాయమని బాధితులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరు నగరం హై రోడ్డు లోని దుర్గం పెట్రోల్ బంక్ యజమాని నిర్మల చిత్తూరు నగరంలోని అనేకమంది వద్ద లక్షలు రూపాయలు తీసుకొని తిరిగి ఇవ్వడం లేదంటూ బాధితులు మంగళవారం పెట్రోలు నింపే వాహనాన్ని అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిత్తూరు రాంనగర్ కాలనీకి చెందిన శివయ్య మాట్లాడుతూ ఆరు సంవత్సరాల క్రితం 10 లక్షల రూపాయలు దుర్గం పెట్రోల్ బంకు యజమాని నిర్మల వడ్డీకి తీసుకొని తిరిగి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డీతో సహా ప్రస్తుతం 20 లక్షల రూపాయలు అయిందని ఎన్నిసార్లు అడిగినా సరైన సమాధానం చెప్పకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాల ప్యాకెట్లు విక్రయించే తాము అప్పు తీసుకుని పెట్రోల్ బంకు యజమానికి ఇచ్చామని తెలిపారు. పెట్రోల్ బంకు యజమానికి అప్పు ఇచ్చినట్లుగా తమ వద్ద ఆధారాలు ఉన్నట్లు తెలిపారు. ఇచ్చిన అప్పు తిరిగి ఇవ్వాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ఇచ్చిన అప్పు తిరిగి తమకు చెల్లించి న్యాయం చేయాలని వేడుకున్నారు. తమలాగా చిత్తూరులో అనేక మంది వద్ద అప్పు తీసుకుని తిరిగి ఇవ్వడం లేదని తెలిపారు.

ఏపీ కనీస వేతనాల సలహాల మండలి సభ్యుడిగా శరవణ

ప్రజాశక్తి - కుప్పం: ఆంధ్రప్రదేశ్ కనీస వేతనాల సలహా మండలి సభ్యుడిగా శరవణ నియమితులయ్యారు. ఐటీడీపీ రాష్ట్ర సభ్యుడిగా ఉన్న శరవణకు ఏపీ కనీస వేతనాల సలహా మండలి సభ్యుడిగా అవకాశం ఇవ్వడం పట్ల టిడిపి నేతలు హర్షం వ్యక్తం చేశారు.

నవ ధాన్యాల పంటను పరిశీలిస్తున్న అధికారులు

నవధాన్యాల సాగుతో అధిక ఆదాయం

ప్రజాశక్తి - రొంపిచెర్ల:

నవధాన్యాల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రొంపిచెర్ల మండలంలోని రొంపిచెర్ల గ్రామపంచాయతీ, వారణాసి వారి పల్లెకి చెందిన మహిళా రైతు యమునా మామిడి తోటలో 20 రకాల నవధాన్యాలు వేశారన్నారు. గత మూడు సంవత్సరాలుగా ఈపీఎండీఎస్ పద్ధతిని పాటించడం వల్ల మామిడి దిగుబడి పెరిగిందని తెలిపారు. నవధాన్యాల సాగుతో అధిక దిగుబడులు కూడా సాధించారన్నారు. నవధాన్యాల పంటను పశువులకు మేతగా వాడుకోవడం వల్ల పాలలో వెన్న శాతం పెరిగి మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించారన్నారు. ఉపయోగాల గురించి ప్రాజెక్టు మేనేజర్ వాసుకి మహిళా రైతు తెలిపారన్నారు. నవధాన్యాల పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంటి రమేష్, పీఆర్పీ రెడ్డమ్మ, ఎల్2 కోమల, ఐసీఆర్పీ లు వీ.ఆర్.అనంతలక్ష్మి, పి. సుధారాణి, శ్రీహరి పాల్గొన్నారు.

వృత్తి రీత్యా రైతు..

- ప్రవృత్తి.. రచయితగా మునిరత్నం రెడ్డి
- మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన ఆదర్శవాది

ప్రజాశక్తి-పలమనేరు: ఇతని పేరు మునిరత్నం రెడ్డి, ఆయనంటే ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాలో లోనే కాక ఆంధ్రప్రదేశ్ , కర్ణాటక ప్రాంతాలలో పలువురికి సుపరిచయం. ఇతను ఇంటర్మీడియట్ స్థాయి నుండే రచనలు, కావ్యాలు, పద్యాలు చక్కగా రాసే శైలి ఆయన సొంతం.. ఆయన రచనలు మ్యాగజైన్స్ లో తరుచుగా కంట పడేవి. కొన్ని అనివార్య కారణాల వల్ల ఇంటర్ తప్పి పోవడంతో కలం పట్టాల్సిన మునిరత్నం రెడ్డి చేతిలో పార పట్టి వ్యవసాయంలో రాణించాడు. కానీ ఏదో తెలియని అసంతృప్తి కొన్ని ఏళ్ల ఆయనను వెంటాడింది. ఇప్పటి వరకు 10 వేలు దేవాలయాల చరిత్రలు రాసి, 2 లక్షలు వరకు బుక్స్ ప్రింట్ చేసి, పంచి పెట్టారు. మరో 20 పుస్తకాలు ప్రింటింగ్ సిద్ధంగా వున్నాయని తెలిపారు. తనది చిత్తూరు జిల్లా, గంగవరం మండలం లోని బత్తనపల్లె అని, ఇంటర్ వరకే చదివానని తెలిపారు. ఆ రోజుల్లో అధ్యాపకుడు మనిరత్నమాచారి ప్రేరణతోనే రచనపై మక్కువ పెరిగిందని ఆయన తెలిపారు. తన తండ్రి వెంకటరామి రెడ్డి కి కూడా ఐదు భాషల్లో ప్రావీణ్యం వుందని ఆయన పేర్కొం టున్నారు.

సమాజానికి ఉపయోగపడే కవితలు

నేటి ఊహాజనిత సమా జానికి కాల్పనిక కవిత్వం ద్వారా ఒరిగిందే మీ లేదనేది తన వాదన అని పేర్కొంటున్నారు. తొలుత 'నమ్మకాలు-సత్యాలు' అనే రచనలో సైన్స్, విజ్ఞానాన్ని మేళవించి మూఢ నమ్మకాలు పారదోలే ప్రయత్నం చేశారు. ఈ గ్రంథాన్ని ప్రభుత్వం ఆరు వేల ప్రతులు గ్రంథాలయా లకు అందించారు.

85 దేశాల నాణేలు సేకరణ

పురాతన నాణేలు సేకరణ కూడా ఆయన నిరంతర ప్రక్రియగా మలుచుకున్నారు. ఇప్పటి వరకు 85 దేశాల నాణేలు, నోట్లు సేకరించారు. మన దేశానికి సంబంధించి 1717 సంవత్సరం నుండి, మన చుట్టు పక్క ల దేశాల నాణేలు సేకరించానని తెలిపారు.

చరిత్ర పరిశోధన....

నాటి చరిత్రను నేటి ప్రపంచానికి తెలపడంలో సంతృప్తి వుంటుందని, తన గ్రంథాలు ఆధారాలను తిరు పతిలోని వ్యాస ప్రతుల గ్రంథాలయం, శ్వేత లైబ్రరీ పరిశోధ నలకు తీసుకున్నారని తెలిపారు. తనను చరిత్రకారులు, స్కాలర్స్, న్యాయవాదులు కలుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. 250 సమస్యలు గుర్తించానని, కళాశాలల్లో విద్య నేర్పుతున్నారు. కానీ బతుకు తెరువు నేర్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిపై చైతన్యం తేవడానికి 'మహాపంచాయతీ పుస్తకం' ప్రచురణకు సిద్ధంగా ఉందని తెలిపారు.

CORRECTION OF DATE OF BIRTHS

I,**B.S.HEMAGIRI,** Son of B.SUBRAMANYAM REDDY, residing at 209, Malibu Sparkling Wings Apartment,10th Cross, Friends Layout, Chinnappanahalli, Bangalore North, Po- Doddanekkundi, Bengaluru, Karnataka-560037 hereby declare that I have to amend Date of Births of my parents as follows

1.B SUBRAMANYAM REDDY(Father)
Date of Birth as per Service Record **15/09/1958**
Date of Birth to be amended as per Aadhar Card **04/07/1961**

2.B SASIKALA(Mother)
Date of Birth as per Service Record **16/02/1961**
Date of Birth to be amended as per Aadhar Card **10/06/1960**